

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో స్వయం ఉపాధి కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల పదో తేదీ నుంచి ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ కోర్సుల్లో నెల రోజుల పాటు శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల లోపు గ్రామీణ ప్రాంత యువకులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 95534 10809, 79933 404407 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆ పార్టీలను ఓడించాలి

- లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్



సమావేశంలో మాట్లాడుతున్న తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మతోన్మాద బిజెపితో జత కలిసిన టిడిపి, జనసేన కూటమిని... నిరంకుశ వైసిపిని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలని కోరారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నియంతృత్వ బిజెపి ప్రభుత్వం దశాబ్దకాలంగా సాగించిన పాలనతో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి మూల స్తంభాలుగా భావించే లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ఆర్థికసార్వభౌమత్వం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయ వ్యవస్థలను పద్ధతి ప్రకారం బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం దేశంలో కార్మిక హక్కులను కాలరాసేందుకు నిరంకుశ పద్ధతులను అవలంభిస్తోందన్నారు. తద్వారా భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అత్యంత అసమానతలు కలిగిన సమాజాల్లో ఒకటిగా మారుస్తోందని విమర్శించారు. మరోవైపు ప్రజలను మతపరంగా విభజించేందుకు విషపూరితమైన మతోన్మాద సిద్ధాంతాలను అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు పెట్టుకోవడం... బిజెపి తొత్తుగా వైసిపి వ్యవహరించడం ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని, లోక్‌సభలో సిపిఎం, వామపక్షాల బలాన్ని పెంచి కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాద ప్రభుత్వం ఏర్పడేలా చూడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ అరుకు పార్లమెంట్‌కు సిపిఎం అభ్యర్థి పోటీ చేస్తున్నారని, విజయానికి అందరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు కె.మోహనరావు, కె.నాగమణి, ఎన్.షణ్ముఖరావు, పి.తేజేశ్వరరావు, సిర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోతుల రోడ్డుపై గళం విప్పిన జనం

- శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డుపై నిరసన
- తక్షణమే పనులు పూర్తి చేయాలని డిమాండ్



రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రూరల్

మరమ్మతులకు నోచుకోక గతుకులమయమైన శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని కోరుతూ జనం రోడ్డెక్కారు. శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారిపై మండలంలోని వాకలవలస వద్ద ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ ఇటీవల ఇద్దరు కానిస్టేబుళ్లు మృతి చెందారు. దీంతో ఆగ్రహించిన పరిసర గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ చేపడతామని నాయకులు చెప్పి అప్పట్లో మరమ్మతులు చేపట్టకుండా విడిచిపెట్టారనిన్యాయవాదులు బొడ్డేపల్లి మోహనరావు, పైడి విశ్వేశ్వరరావు విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఆర్భాటంగా పనులు ప్రారంభించి ఉన్న రోడ్డును గోతులమయం చేసి గాలిలో వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు నెలల వ్యవధిలో ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై 20 మంది వరకు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. గోతులమయమైన ఈ రహదారిపై ప్రయాణించి వేల మంది వాహనదారులు అనారోగ్యం పాలయ్యారన్నారని చెప్పారు. నిత్యం ఈ రహదారిపై ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని ధ్వజమెత్తారు. సుమారు పది కిలోమీటర్ల పొడవునా పెద్ద పెద్ద గోతులతో దారుణంగా ప్రధాన రహదారి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం శ్రీకాకుళం నుంచి శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌కు వెళ్లే వాహనాలు, రాయఘడ, పర్లాకిమిడి, గుణుపూర్, పాలకొండ, పార్వతీపురం, కొత్తూరు, పాతపట్నంతో పాటు ఇతర మండల కేంద్రాలకు వెళ్లాలన్నా ఈ రోడ్డు ప్రధానమైందని వివరించారు. తక్షణమే ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని ఆర్అండ్‌బి అధికారులతో చర్చించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పాలన అందిస్తాం

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - కవిటి

వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సాగించిన అరాచకాలను భరించలేక, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని లండారిపుట్టుగ సర్పంచ్ మురపాల కుమారి, మురపాల కాళీప్రసాద్ కొండిపుట్టుగలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రస్తుతం దయనీయ స్థితిలో ఉందని, చివరకు పింఛను డబ్బులు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకుందని విమర్శించారు. ప్రగతికి పట్టుకొమ్మలైన పంచాయతీలకు అందించాల్సిన నిధులనూ పక్కదారి పట్టించి పంచాయతీల అభివృద్ధికి గండికొట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానిదని ఆరోపించారు. రాష్ట్రాన్ని నిర్దాక్షిణ్యంగా విడదీసిన పరిస్థితుల్లో విభజన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తే, వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. సైకోకి ఒక్క అవకాశం ఇచ్చినందుకు ప్రజలు పశ్చాత్తాపం చెందుతున్నారని, తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దే అనుభవజ్ఞుడైన నాయకుడి కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు సుస్థిరమైన సంక్షేమ పాలన టిడిపి ప్రభుత్వం అందిస్తుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఎమ్మెల్యే అశోక్ సతీమణి బెందాళం నీలోత్పల, బిజెపి కార్యదర్శి కృష్ణ, నాలుగు మండలాలకు చెందిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కాళీప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని లింగాలవలస, శెలిగాం, పోలవరం, రాధవల్లభాపురం, గంగధరపేట, రావివలస, ధర్మనీలాపురం, తలగాం, తేలినీలాపురంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల సిబ్బంది ఉండేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఓటర్లకు కల్పించే సదుపాయాలను పర్యవేక్షించి పరిశీలించి సూచనలు చేశారు. వికలాంగులు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపు నిర్మాణాలు వంటి వాటిని పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా అందుకు సన్నద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.బాలమురళీకృష్ణ, ఆర్ఐ డి.ఢిల్లేశ్వరరావు, ఎన్నికల డిటి విజయ, బిఎల్ఒలు, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

బిసిలకు అధిక ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నిరుపేదలకు అండగా నిలవడమే కాకుండా పదవుల్లో బిసిలకు అధిక ప్రాధాన్యత కల్పించింది వైసిపి మాత్రమేనని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన బిసి నేతలు వైసిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులకు వైసిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రూ.నాలుగు వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణపు పనులు చేపట్టామన్నారు. రూ.400 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. రూ.700 కోట్లతో ఉద్దానం ప్రాంతానికి సురక్షిత తాగునీరు అందించామన్నారు. 31 లక్షల మందికి నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందించామని, శ్రీకాకుళం నియోజవర్గంలో 24 వేల మందికి పట్టాలు అందించామని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేశామన్నారు. సామాజిక తరగతుల ప్రాధాన్య క్రమంలో భాగంగా యాదవులకు రాజ్యసభ టిక్కెట్, ఐదు ఎమ్మెల్సీ టిక్కెట్లు ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు రెండు ఎంపీ, నాలుగు ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించినట్లు తెలిపారు. టిడిపి అధికారంలో ఉన్న సమయంలో యాదవులకు ఇన్ని పదవులు ఇచ్చారా అని ప్రశ్నించారు. పెద్దపాడులో తాగునీటి అవస్థలు తీర్చేందుకు సంబంధిత పనులకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఇందుకు రూ.24 కోట్లతో డ్రింకింగ్ వాటర్ స్కీమ్ నిర్మాణం చేపట్టామన్నారు. ఎన్నడూ లేని విధంగా అరసవల్లి ట్రస్టులో బిసిలకు స్థానం కల్పించామని చెప్పారు. వీటన్నింటనీ గమనించి మేలు చేసే ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జి.కృష్ణయాదవ్, వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదరరావు, పాలిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక ఎన్నికల వేళ...


ఇక లెక్కలు పక్కా

- లోక్‌సభ అభ్యర్థికి రూ.95 లక్షలు
- ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు
- అభ్యర్థులకు బ్యాంకులో ప్రత్యేక ఖాతా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి రూపాయి ఖర్చుకు అభ్యర్థులు లెక్కలు చూపాలి. దీన్ని తేలిగ్గా తీసుకుంటే గెలిచినా, తర్వాత పదవి కోల్పోవాల్సి ఉంటుంది. ప్రతి ఖర్చూ రోజువారీ పద్దుల పుస్తకంలో నమోదు తప్పనిసరి. అభ్యర్థుల పేరుతో బ్యాంకులో ప్రత్యేక ఖాతా తెరవాల్సి ఉంటుంది. పారదర్శకంగా లెక్కలు చూపేందుకు దేనికి ఎంత ఖర్చు చేయాలన్న ధరలను ఎన్నికల సంఘమే నిర్ణయించింది. దీన్ని ప్రామాణికంగా తీసుకుని సభల నిర్వహణ, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ర్యాలీలు, ఇతరాల ప్రతి ఖర్చుకూ లెక్కలు చూపక తప్పదు. లోక్‌సభ అభ్యర్థులు రూ.95 లక్షలు, శాసనసభ అభ్యర్థులు రూ.40 లక్షల వరకూ ఖర్చు చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతించింది. దీనికి లోబడే ఖర్చు ఉండాలి.

జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గాలు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఉన్నాయి. వీటిలో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా తప్పక లెక్కలు చూపాల్సిందే. నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటారు. మద్యం, నగదు, కానుకల పంపిణీని చట్టవిరుద్ధమైన వ్యయంగా పరిగణిస్తారు. ఇందుకోసం ఇసి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు చొప్పున సహాయ వ్యయ పరిశీలకులను, పార్లమెంట్ స్థానానికి సంబంధించి అన్ని విభాగాలను పరిశీలించేందుకు మరో ఎనిమిది మంది ఎన్నికల వ్యయ పరిశీలకులను ఇప్పటికే నియమించింది.



ఖర్చుల లెక్కలు ఎలా..?

ప్రచారంలో భాగంగా రాజకీయ పక్షాలు ఏర్పాటు చేసే మైకు దగ్గర నుంచి బ్యానర్ల వరకు, కార్యకర్తలకు ఇచ్చే తేనీరు, నీటి బాటిల్ నుంచి భోజనం వరకూ అన్నింటికీ నమోదు చేయాల్సిన ధరల జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఇంతకుమించి ఖర్చు చూపితే అదనపు వ్యయంగా పరిగణిస్తారు. కొన్నింటికి సామర్థ్యం, మరికొన్నింటికి కొలతల వారీగా ఈ ధరలను నిర్ణయించారు. సామర్థ్యం ప్రామాణికంగా రూ.1,200 నుంచి రూ.ఐదు లక్షల వరకు సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. చదరపు అడుగు ఎల్ఇడి వాల్స్‌కు రూ.342 వరకు అనుమతిస్తారు. కళ్యాణ మండపానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష, టన్ను ఎసికి రూ.4 వేలు, ఎయిర్ కూలర్లకు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వెచ్చించవచ్చు. ఎన్నికల ప్రచారమన్నాక బ్యానర్లు, బ్యాడ్జీలు, జెండాలు, పోస్టర్లు, అనుచరులకు అల్పాహారాలు, భోజనాలు, తప్పవు. వీటిలో ప్రతి అంశమూ వ్యయ పరిమితికి లోబడే ఉండాలి. పార్టీ గుర్తు ఉన్న ప్రతి వస్తువుకూ నిర్ణీత ధర ప్రకారమే పద్దు రాయాలి. సాధారణ కుర్చీకి రూ.5 నుంచి రూ.20, స్టీలు కుర్చీకి రూ.100, మహారాజా సోఫాకు రూ.1,500, షామియానాలకు రూ.800 నుంచి రూ.10 వేలు, మినీ జనరేటర్‌కు రూ.3,500, 125 కెవి జనరేటర్‌కు రూ.20 వేలకు మించకూడదు. 200 గ్రాముల పులిహోర, ప్లేట్ ఉప్మా, దోశలకు రూ.30 వంతున లెక్కించాలి.

ర్యాలీల్లో పాల్గొన్న వారి ఖర్చు కూడా...

ప్రచారంలో నిర్వహించే ర్యాలీల్లో ఆయా పార్టీల కార్యకర్తలతో పాటు కూలీలు పాల్గొంటారు. వీరు సభా ప్రాంగణాల ఏర్పాటుకే పరిమితం కారు. వందల సంఖ్యలో జనసమీకరణ జరగాలంటే అందుకు కొంత వ్యయం భరించాల్సిందే. ఈ ఖర్చును వారి కూలిగా చూపాలని ఎన్నికల సంఘం పేర్కొంది. బైక్‌కు ఐదు లీటర్ల పెట్రోల్‌కు రూ.550, ఎద్దుల బండికి రూ.1,500, నైపుణ్యం లేని కార్మికులకు రూ.519 నుంచి రూ.649 వరకు, మోస్తరు నైపుణ్యమున్న వారికి రూ.621 నుంచి రూ.776 వరకు, నిపుణులకు రూ.741 నుంచి రూ.926, అతి నైపుణ్యమున్న వారికి రూ.1,046 నుంచి రూ.1,059 వరకు చెల్లించాలని ఇసి సూచించింది. ప్రస్తుత ధరలు, డిమాండ్‌ను బట్టి ఇంతకంటే అధికంగానే చెల్లించినా ఈ మేరకు మాత్రమే వారు ఇసికి సమర్పించే వ్యయ నివేదికల్లో పొందుపరచాల్సి ఉంటుంది. లెక్క తప్పితే తదనంతరం ఎన్నికైనా ఇబ్బందులు తప్పవు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి

రచయితలు ముందుకు రావాలి

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అశాస్త్రీయ భావనలు, మూఢనమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో శాస్త్రీయ సమాజం, ప్రజా సంక్షేమం కోసం కవులు, రచయితలు తమ రచనలతో ప్రజానీకాన్ని చైతన్యవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో జెవివి జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాదిని పురస్కరించుకుని సమాజాభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక పిలుపుమేరకు అనేకమంది కవులు, రచయితలు కవితలు, వ్యాసాలు రాసి పంపారని తెలిపారు. జిల్లాస్థాయి కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకట రాజారావు, బూర్జ మండలానికి చెందిన పప్పల వైకుంఠరావు, కోటబొమ్మాళికి చెందిన నవ్యశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. గార మండలానికి చెందిన భోగెల ఉమామహేశ్వరరావు కన్సొలేషన్ బహుమతికి ఎంపికయ్యారని తెలిపారు. వ్యాసరచన పోటీల విజేతలుగా ప్రథమ స్థానం జి.సిగడాంకు చెందిన కోవెలకొండ సంతోష్ కుమారస్వామి, శ్రీకాకుళం నగరానికి చెందిన చాడ శ్రీనివాసరావు, ఇచ్ఛాపురానికి చెందిన ఎస్.వాహిని ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. అనంతరం విజేతలకు మెమోంటోలు, డైరీలు, పుస్తకాలను అందించి సత్కరించారు. కవితలతో ప్రజలను చైతన్యవంతం చేస్తున్న కవి కె.వి రాజారావును, నాటక రంగంలో చేస్తున్న కృషికి గానూ జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావును సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ పూజారి గోవిందరావు, జెవివి జిల్లా కోశాధికారి వి.ఎస్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సామ సంజీవరావు, జిల్లా కార్యదర్శి ఆర్.సురేష్‌బాబు, జిల్లా సైన్స్ అండ్ కమ్యూనికేషన్ కన్వీనర్ హనుమంతు మన్మథరావు, పర్యావరణ కమిటీ జిల్లా కన్వీనర్ ఎ.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



జనార్ధనరావును సత్కరిస్తున్న జెవివి నాయకులు



మాట్లాడుతున్న డాక్టర్ గౌతమి

నడకతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఒత్తిడిని జయించడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించడానికి నడక దివ్య ఔషధమని మూత్రపిండాల వైద్య నిపుణులు డాక్టర్ బెందాళం గౌతమి అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది నా ఆరోగ్యం - నా హక్కు అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నట్టు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లే కీలకమన్నారు. శారీరక శ్రమతో పాటు నడక, వ్యాయామం, యోగా, సమయానికి ఆహారం తీసుకోవడం వలన అనేక రకాల వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ శాసపు జోగి నాయుడు, మాజీ గవర్నర్ జి. ఇందిరా ప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ఎన్‌సిసి అధికారులు డాక్టర్ వై.పోలినాయుడు, బి.వరలక్ష్మి, పావని, స్టార్ వనితా నడక సంఘం అధ్యక్షురాలు జి. లక్ష్మీ, స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి. దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

ప్రజాశక్తి
www.prajasakti.com


మంత్రి ధర్మానను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

'తమ్మన'కు ఆర్యవైశ్యుల సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తమ్మన భాస్కరరావును ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన నగరంలోని ఆవోపా కళ్యాణ మండపంలో ఆదివారం సత్కరించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్య కుటుంబాలతో తనకు గల సాన్నిహిత్యాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. ఆడిటర్‌గా ఎంతో మందికి సేవలందిస్తున్న తమ్మన భాస్కరరావు సామాజిక వర్గ ప్రయోజనం కోసం కృషి చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో అరసవల్లి ట్రస్టు బోర్డు సభ్యులు మండవల్లి రవి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎంఎస్ఎస్ గుప్తా, కార్యదర్శి కొప్పుగంటి సంతోష్, కోశాధికారి పూసర్ల నగేష్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ధర్మానను ఆర్య వైశ్యులు సత్కరించారు.


పార్టీలో చేరిన వారితో మంత్రి అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస మంత్రి కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో మండలం గురుదాసుపురంకు చెందిన 35 మంది టిడిపి నుంచి వైసిపిలో చేరారు. వీరికి మంత్రి అప్పలరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పోతనపల్లి మాధవరావు, సోర్ర పురుషోత్తం, సోర్ర పాపారావు, వెంకటరావుతో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు సోర్ర కామేశ్వరరావు, జెడ్‌పిటిసి మచ్చ ధనరాజు, ఎంపిటిసి గోరకల షణ్ముఖ, ఎఎంసి వైస్ చైర్మన్ జనగ లోకేశ్వర, సోర్ర రామారావు, బొడ్డు దాసు, సంతోష్ పాల్గొన్నారు.


విజయకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న యూనియన్ నాయకులు

యూనియన్ సంక్షేమానికి కృషి చేస్తా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ట్రాలీరిక్షా, ఆటో యూనియన్‌ల సంక్షేమానికి కృషి చేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రాలీ రిక్షా యూనియన్ సభ్యులు, ఆటో రిక్షా యూనియన్‌తో సమావేశాన్ని మునిసిపల్ వైస్ చైర్మన్ లాభాల స్వర్ణమణి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సమావేశాలకు పిరియా విజయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బర్ల లక్ష్మణరావు, 7వ వార్డు ఇన్‌ఛార్జి పటన నీలాద్రి రెడ్డి, సీనియర్ నాయకులు పటన కృష్ణ, పటన హరికృష్ణ, గుజ్జు హనుమ, నందిని సోమేశ్ రెడ్డి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ సాలినా ఢిల్లీరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు సంఘాలు ఆమెకు మద్దతు పలికాయి.


ప్రచారం చేస్తున్న గాంధీ

ఇంటింటా గాంధీ ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరిగిందని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. ఆదివారం మండలంలోని కొర్లకోటలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఐదేళ్ల కాలంలో శిలాఫలకాలే తప్ప అభివృద్ధి పనులు కానరాలేదన్నారు. గడచిన పదేళ్లుగా మామ్మ, అక్కులప్ప ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి, మండలంలోని ఇసుకల పేట, హనుమంతువలస, దివంజిపేట తదితర గ్రామాల రహదారులకు శిలాఫలకాలు వేయడమే తప్ప నేటివరకు పూర్తి చేయలేదని ఇదే వారి అభివృద్ధా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సువ్వారి అనిల్ కుమార్, పేడాడ వైకుంఠరావు, సువ్వారి రాధాకృష్ణ, పేడాడ పూర్ణారావు, బగాది నేతాజీ,శ్యామలరావు, రామ్మోహన్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైసిపికి లేదు

ప్రజాశక్తి- పలాస


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సిఎం జగన్ నుంచి ఇక్కడ మంత్రి అప్పలరాజు వరకు ఏ ఒక్క వైసిపి నాయకుడు ఈ ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయాలని అడిగే నైతిక హక్కు లేదని సామాజిక సేవా నాయకుడు, టిడిపి యువజన నాయకుడు మన్నాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గణపతి రెసిడెన్సీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశలవారీగా మద్యనిషేధం అని హామీ ఇచ్చి నేడు నాసిరకం మద్యం విక్రయాలు జరుపుతూ ప్రజలను అనారోగ్యపాలు చేస్తున్నారని, సంక్షేమ పథకాలు కొంత మందికి మాత్రమే పరిమితమయ్యాయని, మిగిలిన వారు పథకాలు అందక తీవ్ర అవస్థలు పడుతుంటే తాము పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. మంత్రి అప్పలరాజుకు ప్రశ్నించే హక్కు తనకే ఉందని, మంత్రి అప్పలరాజు సంగతి మొదటి నుంచి తెలిసిన వ్యక్తిగా ఆయన ఇచ్చిన హామీలు, నెరవేర్చని హామీలపై ప్రశ్నించే హక్కు తనకు ఉందన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత కాలంలో ఆహారపు అలవాట్లు, నిద్ర లేకపోవడం ఇతర కారణాలతో ఎక్కువ శాతం మంది అనారోగ్యం పాలవుతున్నారని, అందువల్ల తప్పనిసరిగా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మేరకు మందులు వాడుకోవాలని సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పేర్కొన్నారు. ఆదివారం లైయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సన్‌రైజ్ ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థులు ఇంటింటా ప్రచారం


పలాస : ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

సిఎం జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మేలు చేయడం జరిగిందని మంచి చేసిన ప్రభుత్వానికి మరోమారు ఆశీర్వదించి జగన్‌ను సిఎంగా, తనను ఎమ్మెల్యేగా, ఎంపిగా పేడాడ తిలక్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. మున్సిపాలిటీలో మంత్రి సీధిరి అప్పలరాజు ఆదివారం రెండవ రోజ 22, 23, 25, 27 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డుల్లో ప్రచార రథం నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో మీ ఇళ్లకు పలుమార్లు పలు సందర్భాలలో వచ్చినప్పటికీ నేడు ఓటును అభ్యర్థించడానికి రావడం జరిగిందన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సిఎంగా పనిచేసిన కాలంలో ఏ ఇంటికయినా ఒక్కరూపాయి సహాయం అందిందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బుజ్జి, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జిలు బోర చంద్రకళ, దుర్గా ప్రసాద్, గూన మన్మధరావు, గుజ్జు జోగారావు, శ్రీను పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని గోరింటలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ మరలా ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి మరొక అవకాశాన్ని కల్పించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈయన వెంట రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు), ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడన వెంకటకృష్ణారావు, వైసిపి నాయకులు గుడ్ల మోహన్ పాల్గొన్నారు.

నరసన్నపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. చోడవరం, కోబగాం, నడగాం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల పార్టీ అధ్యక్షుడు లుకలాపు రవికుమార్, ఉపాధ్యక్షుడు బగ్గు రమణయ్య, జెసిఎస్ సురంగి నర్సింగరావు, జిల్లా ప్రచార కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీలో రాందాసు పేట, గొల్లవీధి, చిన్న బజార్‌లో ఎమ్మెల్సీ, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లి అజయ్, జెసిఎస్ కన్వీనర్ సిగిలిపల్లి మోహనరావు, యువజన అధ్యక్షుడు మురళీ, పిఎసిఎస్ అధ్యక్షుడు సత్తార్ సత్యం, పట్టణ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్ కుమార్, గురునాథ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలం బాల కృష్ణాపురంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుక్క లోకేశ్వర్‌రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, బతకల మోహన్‌దాస్, చైర్మన్ బాబురావు, నూకయ్య రెడ్డి, పిట్ట హేమలత, ఆశి మందాకిని, పురుషోత్తం రెడ్డి, కాళ్ల సత్యం పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలం మరువాడ పంచాయతీ అర్.మరువాడ, లక్కివలస పంచాయతీలో లక్కివలస, గెద్దలపాడు, పిట్టవానిపేట, గొలుగువానిపేట, శెగిడి లక్కివలసలో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి మేరుగు రాజేశ్వరి, వైస్ ఎంపిపి ప్రతినిధులు నక్క భీమారావు, పొందల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కోత సతీష్, ఈశ్వరరావు, వీరాస్వామి, ఎంపిటిసి రాజులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న స్పీకర్ సీతారాం


టెక్కలి రూరల్ : ప్రచారం చేస్తున్న శ్రీనివాస్


నరసన్నపేట : ఓటరుకు పోస్టర్‌ను అందజేస్తున్న కృష్ణదాస్

ఒడియా విద్యాభివృద్ధికి కృషి


కవిటి : బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి- కవిటి

పరీక్షల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసి తద్వారా ఒడియా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొలై, మండల శాఖ అధ్యక్షుడు కేశవ పురియా తెలిపారు. జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న 5వ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష మండలం పెద్ద మెళియాపుట్టుగ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అపోటా కేంద్ర కమిటీ సలహాదారు ప్రమోద్ కుమార్ పాడి పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షలో పెద్ద ఎర్ర గోవిందపుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎర్ర దొంబురు ప్రథమ స్థానం, రాజపురం ఎంపిపిఎస్‌కు చెందిన టి.నిశిత ద్వితీయ స్థానం, మెళియాపుట్టుగ ఎంపిపిఎస్‌కు చెందిన సౌమ్యా ప్రధాన్ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు ఎంఇఒ ధనుంజయ మజ్జి చేతులమీదుగా ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలు అందజేశారు. కవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లింగరాజ్ ప్రసాద్ పట్నాయక్, చిన్న మెళియాపుట్టుగ ఉపాధ్యాయుడు శ్రీధర్ సామంత్ ఆర్థికసాయంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమా మహాపాత్రో, అపోటా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బేసి కృష్ణమూర్తి, పాటిక లావణ్య, మండల శాఖ ఉపాధ్యక్షుడు లింగరాజ్ ప్రసాద్ పట్నాయక్, కార్యదర్శి మనోజ్ కుమార్ మహరణ, సంయుక్త కార్యదర్శి ప్రదీప్ కుమార్ గౌడ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పురపాలక ప్రాథమిక ఒడియా పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి ఒడియా మేధాసమ్మాన్ పరీక్ష నిర్వహించారు. మండల విభాగం అధ్వర్యంలో మేధ సమ్మాన్ జరిగింది. ఎపి ఒడియా ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు అశోక్ జాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఢిల్లేశ్వర వెట్ట, రఘునాథ్ గౌడో పాల్గొన్నారు. పరీక్ష పరిశీలకులుగా మిన్ను చంద్ర మండల్, సిద్ధార్థ లిమాయి వ్యవహరించారు.

పలాస: ఒరియా విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఎంఇఒలు సిహెచ్ శ్రీనివాసరావు, సిహెచ్ సత్యం అన్నారు. కాశీబుగ్గ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా మేధా సమ్మన్ టాలెంట్ టెస్ట్ చీఫ్ ఎగ్జామినర్ నల్ల నాగేశ్వరరావు, లలితకుమారి. బి.రంజని బిస్వాల్ ఇన్విజలేటర్లు అధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తరాకోట ఎంపియుపి పాఠశాల విద్యార్థిని లిఖితప్రియ, వైష్ణవి పాణిగ్రహి, కాశీబుగ్గ ఎంపియుపి పాఠశాలకు చెందిన సబర శ్రీనులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఖగేశ్వరదొర, ఎల్ఎన్ పండ, చక్రపాణి ప్రధానో, ఆపోటా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.నాగేశ్వరరావు, నాగేశ్వరపాత్రో, శ్రీరామ్, గోవింద్, సుజాత కుమారి, జనార్ధనరావు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : సర్టిఫికేట్ అందిస్తున్న నిర్వాహకులు

మెళియాపుట్టి: మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడ సంధ్రలో ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలో గొప్పిలి, సుందరాడ, చాపర, పడ్డ ఒడియా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎంఇఒలు దేవేంద్రరావు, పద్మనాభరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అపోటా జిల్లా వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర పండా, మండల అధ్యక్షులు రవి కుమార్, సెక్రటరీ రాజేష్, హెచ్ఎం రమేష్ చౌదరి, రవి నారాయణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ఒరియా బ్రాహ్మణ వీధి పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒరియా విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా మనోజ్ ప్రథమ స్థానం, హేమంత్ ద్వితీయ స్థానం, శుభశ్రీ పండ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులతో పాటు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఒరియా ఉపాధ్యాయులు సుభాష్, శ్యామలావతి, మురళి, నంద, శోభారాణి, శ్యామలాదేవి, సంజుక్త పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం


ఆమదాలవలస : సూపర్ సిక్స్ పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

ఆమదాలవలస : మండలం కనుగులవలస, తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, ముద్దాడపేట, కలివరం గ్రామాల్లో సర్పంచ్ నూక అప్పల సూరన్నాయుడు ఆధ్వర్యంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ శంఖారావంలో భాగంగా సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి, జనసేన కన్వీనర్లు సూరపు నాయుడు, రామ్మోహన్‌తో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిన్నటి వరకు ఆరాచకం, అవినీతే పరమావధిగా సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిందని, తొందరలోనే వైసిపి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించి ఇంటికి సాగనంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఒక చేత్తో సంక్షేమ పథకాలను ఇచ్చినట్టే ఇచ్చి మరో చేత్తో ప్రజల దగ్గర నుంచి చెత్త, విద్యుత్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను పెంచుతూ ప్రజల నడ్డి విరిచిన ఘనుడు జగన్మోహన్ రెడ్డికి ప్రజలు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతి, మెట్ట సుజాత, తమ్మినేని చంద్రశేఖర్, విద్యాసాగర్, మొదలవలస రమేష్, అన్నెపు భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస: టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జీడికి మద్దతు ధర ప్రకటిస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష జీడి రైతులకు హామీ ఇచ్చారు. మండలం నీలావతి, పెదంచల పంచాయతీల్లో ప్రచారం చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీరికట్ల విఠల్‌రావు, అరుణ కుమారి, వజ్జ బాబురావు, మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, తలగాణ నర్సింహమూర్తి, దువ్వాడ శ్రీహర్ష, బిజెపి నాయకులు రామానంద స్వామీజీ, మామిడి ప్రసాద్, జనసేన నాయకులు సంతోష్ పండా, అట్టాడ వాసు, తమ్మినేని గంగారామ్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 49వ డివిజన్ పరిధిలోని పిఎన్ కాలనీలో సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ విస్తృత ప్రచారం చేపట్టారు. టిడిపి, జనసేన, బిజెపి అభ్యర్థిగా తనకు ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ర కార్యదర్శి పైడి వేణుగోపాలం, పైడి రాజారావు, నాయకులు పాల్గొన్నారు. అలాగే గార మండలం రామచంద్రపురంలో తెలుగు మహిళ అధ్యక్షులు గొండు స్వాతి, అంబటి చక్రధర్, అంబటి రంగారావు, సాదు జనార్ధన, కుంచాల సురేష్, సాదు మల్లికార్జున ఆధ్వర్యాన ప్రజాగళం, సూపర్ సిక్స్‌పై ఇంటింటా ప్రచారం నిర్వహించారు.


పలాస : పెదంచలలో ప్రచారం చేస్తున్న శిరీష

వజ్రపుకొత్తూరు: కోమరల్తాడలో క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా అధ్యక్షులు పుచ్చ శోభారాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కర్ని ఢిల్లేశ్వరి, మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, కర్ని రమణ, గోవిందు పాపారావు, దున్న షణ్ముఖరావు, దుర్రి నారాయణస్వామి, రఘు, శివప్రసాద్ పాల్గొన్నారు.


గేదెలపేట జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న టిడిపి జెండా

అధికారుల నిర్లక్ష్యం

జి.సిగడాం: జి.సిగడాం మండలం గేదెలపేట జంక్షన్ వద్ద తెలుగుదేశం పార్టీ జెండా విద్యుత్ స్తంభానికి వేలాడుతూ ఎగురుతుంది. పొందూరు నుంచి రాజాం వైపు వెళ్లే మెయిన్ రోడ్డులోనే టిడిపి జెండా ఉండడంతో ఏ అధికారిగాని, నిత్యం అదే జంక్షన్ నుంచి వెళ్ళే గ్రామ సచివాలయ సిబ్బంది గమనించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇంత నిర్లక్ష్యంగా అధికారులు వ్యవరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన, ప్రతినెల ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక


పోలాకి : పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న రమణమూర్తి

పోలాకి: మండలం రాళ్లపాడులో మాజీ సర్పంచ్ బోర కృష్ణ, వార్డు సభ్యులు బోర అప్పలరాజు, టి.కృష్ణ, కుమ్మరి భూషణతో పాటు 150 కుటుంబాలు ఆదివారం వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. అలాగే వనితకు చెందిన ఎన్ని రమేష్, ఎన్ని సూర్యారావు, రాకోటి వెంకటరావు, కురిటి గోవిందరావు, చిన్న రమణ, దంతవేణుతో పాటు 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కారుకోల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, భైరి భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస: శివాజీ నగర్‌లో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బిల్లు నారాయణమ్మ, తులసి, భూమిక, నారాయణ, మోహన్ నారాయణ తదితరులున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, బడ్డ నాగరాజు, సప్ప నవిన్, సవర రాంబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ అందరివాడు

కవిటి: అంబేద్కర్ అందరివాడని జై భీమ్‌సేన జిల్లా ప్రధాన కార్యదర్శి డొప్ప వెంకటరావు అన్నారు. మండలం ఖాజూరులో అంబేద్కర్ విగ్రహం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు జై భీమ్ సేన ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటంతో గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ భారత దేశానికి రాజ్యాంగం వంటి దిక్సూచి అందించి, అణగారిన వర్గాల అభివృద్ధికి శ్రమించిన అపర మేధావి అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు యువజన సంఘం తరుపున పెన్నులు అందించారు. కార్యక్రమంలో మండలం దళిత సంఘ పెద్దలు బరు రామకృష్ణ, జై భీమ్‌సేన మండలం అధ్యక్షుడు బరు భాస్కర్, యువజన సంఘ నాయకులు సురేష్, మనోజ్, రాజేష్ పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న జై భీమ్‌సేన సభ్యులు, విద్యార్థులు


మృతి చెందిన గురయ్య

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం అక్కవరం జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం లారీ ఢీకొని ముంజేటి గురయ్య (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలాకి మండలం రహమ్మైనపురంకు చెందిన గురయ్య శ్యాంసుందరపురంలో తన కుమార్తెను చూసితిరిగి వస్తున్న క్రమంలో అక్కవరం జాతీయ రహదారిపై శ్రీకాకుళం వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి టెక్కలి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- పలాస

మండలం దానగొరలో మద్యం మత్తులో సవర రవి కుమార్ తన ఇంట్లో ఇనుప కొక్కేనికి ఉరి వేసుకుని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, కాశీబుగ్గ పోలీసులు వివరాల మేరకు రవికుమార్ మద్యానికి బానిసై మద్యం సేవించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో గొడవ పడేవాడని గ్రామస్తులు తెలిపారు. మందలించిన కుటుంబ సభ్యులకు ఉరివేసుకుని చనిపోతానని అస్తమానం బెదిరించేవాడని, ఈ క్రమంలో రవికుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

కృపారాణికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- పలాస

మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల అధ్వర్యంలో చేరడంతో పలాస నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథబాబు, డాక్టర్ జీవితేశ్వరరావులు ఆమెను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినికి అభినందన

కోటబొమ్మాళి: జెవివి ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కవితలు, వ్యాసరచన పోటీల్లో కోటబొమ్మాళి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎన్.నవ్యశ్రీ తృతీయ బహుమతి గెలుచుకుంది. ఈ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థిని తృతీయ స్థానం సాధించడంతో పాఠశాల హెచ్ఎం డబ్బీరు గోవిందరావు, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలం కాలింగ కొత్తపేటలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్యూటీ డాక్టర్ శ్రీనివాస్, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


మజ్జిగను పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

వల్లేవలసకు చెందిన మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో గోవిందపురం పంచాయతీ యరకన్నపేట జంక్షన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజూ మినరల్ వాటర్ అందుబాటులో ఉంచనున్నామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. వీటిని ప్రవాస భారతీయులు రవీంద్ర, సాయి కిషోర్ సమకూర్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు మాస్టర్, రవీంద్ర, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, జగదీష్ , యర్రయ్య పాల్గొన్నారు.

జైభారత్ పార్టీకి అండగా ఉండాలి

కోటబొమ్మాళి: ప్రజలకు నీతివంతమైన, న్యాయమైన పాలనకావాలంటే ప్రతిఒక్కరు జైభారత్ నేషనల్ పార్టీకి అండగా ఉండాలని టెక్కలి నియోజకవర్గ అభ్యర్థి బైపల్లి పరమేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నీతివంతమైన ప్రజాపాలన అందించాలంటే జై భారత్ నేషనల్ పార్టీ అధినేత లక్ష్మీనారాయణకే సాధ్యమన్నారు. పార్టీ నుంచి ఎమ్మెల్యేగా తనకు టిక్కెట్ ఖరారు చేశారని, ఓటర్లందరు టార్చిలైట్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న స్పీకర్ సీతారాం

సత్యనారాయణ మృతికి సంతాపం

పొందూరు: పొందూరు మాజీ సర్పంచ్, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల ఉమాదేవి భర్త, వైసిపి నాయకుడు గంగిరెడ్ల సత్యనారాయణ ఆదివారం వేకువ జామున మృతి చెందారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మృతి చెందిన విషయం తెలుసుకున్న సభాపతి తమ్మినేని సీతారాం చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. సత్యనారాయణ మృతి తనకు తీరని లోటన్నారు. అయనతో పాటు జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ

లావేరు: మండలం లక్ష్మీపురం పంచాయతీ నెదురుపేటకు చెందిన వైసిపి కార్యకర్త బస్వ అంకమ్మను ఆదివారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించారు. ఆమె కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఎమ్మెల్యే వెంట ఎంపిటిసి కాగితల కృష్ణారెడ్డి, కొల్లి రమణ, బాసి రామారావు, బోరా రాజారావు, రామారావు, రాంబాబు ఉన్నారు.